క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న లక్ష్మీనారాయణ

జగిత్యాల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని స్వీప్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మెప్మా కార్యాలయంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలకమైందని, అందుకే అర్హులైన వారందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా మెప్మా మహిళలు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఓటు హక్కు వినియోగం, సీ విజిల్, ఓటరు హెల్ప్‌లైన్, 1950 అంశాలపై అవగాహన కల్పించారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలకు కల్లెడ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన సాయి ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల పీఈటీ వెంకటలక్ష్మి తెలిపారు. ఈనెల 24 నుంచి పెద్దపల్లి జిల్లాలోని సెంటినరీ కాలనీలో జరిగే అండర్– 17 ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీల్లో సాయి పాల్గొంటారని తెలిపారు. ఎంపికై న విద్యార్థిని హెచ్‌ఎం విమల, సర్పంచ్ మహేశ్వర్‌రావు, ఎంపీటీసీ పర్శరాం, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కోరుట్లటౌన్: జాతీయస్థాయి కరాటే పోటీలో పట్టణంలోని ఎల్‌ఎఫ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభ చాటి, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు కోచ్ అల్లె రమేశ్ తెలిపారు. కరాటే పోటీల్లో కటాప్, కుమ్మితే విభాగాల్లో ఇందూరి హర్షిత్ వెండి పతకం, కుందారపు భన్సీధర్ కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ తుమ్మనపెల్లి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సిరికొండ గంగాధర్, మనోజ్ విద్యార్థులను గురువారం అభినందించారు. కార్యక్రమంలో కరాటే కోచ్ అల్లె రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దూలూర్‌లో వైద్యశిబిరం



గ్రామస్తులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

కథలాపూర్: మండలంలోని దూలూర్‌లో పీహెచ్‌సీ వైద్యులు ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న పలువురికి రక్త పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దయ్యా లక్ష్మీనర్సయ్య, వైద్యాధికారి రచన, ఏఎన్‌ఎంలు మహేశ్వరి, రాజమణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రాయికల్‌లో సత్యసాయి జయంతి



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

రాయికల్: సత్యసాయి జయంతి సందర్భంగా రాయికల్ పట్టణంలో గురువారం సత్యసాయి భజనమండలి ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సభ్యులు గాజంగి అశోక్, సుభాష్‌రాజ్, సత్యనారాయణ, గంగరాజం, ప్రభావతి, గీత, ప్రభాకర్ పాల్గొన్నారు.

వెన్నెలవాడగా మారుస్తా

- స్థానికంగా ఉంటాను... సమస్యలు పరిష్కరిస్తాను
- 'సాక్షి'తో కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్



వేములవాడ: ఈ ప్రాంత బిడ్డగా.. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిగా, మీ మధ్యలోనే ఉంటూ మీ సమస్యలపై ప్రతి నిత్యం కొట్లాడుతున్న. నాలుగు సార్లు ఎన్నికల్లో ఓడిపోయినా.. ఈ ప్రాంతాన్ని, ఇక్కడి జనాల్ని వదిలి ఎక్కడికి పోలేదు. అనునిత్యం ప్రజాగొంతుకనై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉన్నాను.. అని వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడను వెన్నెలవాడగా మార్చుతానని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం 'సాక్షి'తో మాట్లాడారు.

సాక్షి: వేములవాడ రాజన్న గుడి అభివృద్ధిపై మీ ప్రణాళిక ఏమిటి?

ఆది : దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నేను రెండు పర్యాయాలు ఆలయ చైర్మన్‌గా పనిచేసిన. భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై నాకు పూర్తి అవగాహన ఉంది. నేను చేసిన అభివృద్ధి తప్ప.. తెలంగాణ వచ్చినాక ఒక్క పైసా పని కూడా కాలేదు. భక్తుల కష్టాలు చెప్పలేనివిగా ఉన్నాయి. రాజన్న గుడి సాక్షిగా ఏటా బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయిస్తామన్న సీఎం కేసీఆర్ ఒక్క రూపాయి ఇవ్వలేదు. రాజన్న గుడికొచ్చి చూస్తే వీళ్లు చెప్పిన అభివృద్ధి ఏమిటో.. భక్తులు పడుతున్న కష్టాలు ఏమిటో తెలుస్తాయి. భక్తుల కష్టాలు, గుడి అభివృద్ధిపై అనేక పర్యాయాలు ఆందోళనలు చేశాం. అయినా రాష్ట్ర ప్రభుత్వంలో ఎలాంటి మార్పు కనిపించలేదు. రాజన్న ఆశీస్సులతో నేను గెలిస్తే తప్పకుండా ఆలయాన్ని దేశంలోనే అగ్రగామిగా ఉంచుతాను.

సాక్షి : వేములవాడ పట్టణం అభివృద్ధిపై మీ ప్రణాళిక ఏమిటి ?

ఆది : వేములవాడ పట్టణం ఆనాడు ఎలా ఉందో ఈనాడూ అలాగే ఉంది. నక్షలు, రంగురంగుల బ్రోచర్లు తప్ప ఎక్కడా అభివృద్ధి చేపట్టిన దాఖలాలు లేవు. ఏళ్ల తరబడి వేములవాడకు వస్తున్న జనం ఇక్కడి అధ్వాన్న పరిస్థితులు చూసి ఆందోళన చెందుతున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా అభివృద్ధి గురించి పాలకులు పట్టించుకోలేదు. గెలిచిన ఎమ్మెల్యే విదేశాలకు వెళ్లడం, చుట్టపుచూపుగా రావడం, అధికారులతో హడావిడి సమావేశాలు పెట్టడం తప్ప చేసిందేమి లేదు. ప్రజల ఆశీర్వాదంతో నేను గెలిస్తే వేములవాడను వెన్నెలవాడగా మార్చుతాను. రాష్ట్రంలోనే ఈ నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తాను.

సాక్షి : రైతులను ఏ విధంగా ఆదుకుంటారు ?

ఆది : నేను ఓ రైతు బిడ్డనే. అన్నదాతల కష్టాలు నాకు తెలుసు. రైతుల కోసం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమా అంటూ మెట్ట ప్రాంతమైన వేములవాడకు గోదావరిజలాలు ఫాజుల్‌నగర్ రిజర్వాయర్ ద్వారా చేరుతున్నాయి. నన్ను గెలిపిస్తే ప్రతీ ఎకరాకు సాగునీరందించి, రైతులకు బాసటగా నిలుస్తాను. ఇప్పటి వరకు రైతుల కష్టాలపై అనేకమార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేశాను. రైతులకు ఉపయోగపడే పనులు చేసి చూపిస్తాను.

సాక్షి : నియోజకవర్గ అభివృద్ధిపై మీ ప్రణాళిక ఏమిటి?

ఆది: ఈ నియోజకవర్గంలో ఏ గ్రామంలో ఏ సమస్య ఉందో నాకు తెలుసు. ప్రజలు పడుతున్న కష్టాలు తెలుసు. ఈ ప్రాంతవాసులు నన్ను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపిస్తే తప్పకుండా ఈ ప్రాంత ప్రజల్లో ఒకడిగా ఇక్కడే ఉంటాను. అనునిత్యం వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటాను. ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతాను.

సాక్షి : విద్య, వైద్యం, రోడ్లు, రవాణాపై మీ ప్లాన్ ఏమిటి ?

ఆది : విద్య విషయంలో ఈ ప్రాంతం చాలా వెనుకబడి ఉంది. నేటికి మహిళా జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలలు లేవు. నేను గెలవగానే వీటిని ఇక్కడ ఏర్పాటు చేసి విద్యకు పెద్దపీట వేస్తాను. వైద్యం విషయంలో మండలానికే ప్రభుత్వ వైద్యశాల ఏర్పాటు చేయిస్తాను. రోడ్లు సరిగ్గా లేవని చాలా సార్లు పాదయాత్ర చేశాను. అయినా ఇంకా రోడ్లు బాగుపడాల్సిన అవసరం ఉంది. ప్రతీ గ్రామానికి డబుల్‌రోడ్డు వచ్చేలా కృషి చేస్తాను.

సాక్షి : ముంపుగ్రామాలు, యువతకు ఎలాంటి ఉపాధి చూపిస్తారు?

ఆది : సర్వం త్యాగం చేసి మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించిన ముంపు గ్రామాల ప్రజల త్యాగం వెలకట్టలేనిది. సీఎం కేసీఆర్ రాజన్న గుడి మెట్ల సాక్షిగా నిర్వాసిత ఒక్కో కుటుంబానికి రూ.5.04 లక్షలు ఇస్తామని ప్రకటించి మోసం చేశారు. ఈ అంశంపై ముంపు గ్రామాల పక్షాన అనేకమార్లు పోరాడాను. నేను గెలవగానే ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తాను. యువతకు ఉపాధిమార్గం చూపించేందుకు పరిశ్రమలు తీసుకొస్తాను. ఐటీపార్క్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తాను.

సాక్షి : మహిళల సంక్షేమానికి ఎలాంటి ప్రాధాన్యతనిస్తారు?

ఆది : ఇంటికి దీపం ఇల్లాలు. ఇల్లాలు బాగుంటేనే ఇల్లు బాగుంటుంది. మహిళల సంక్షేమానికి పాటు పడతాను. మహిళల అభివృద్ధికి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చి వారికి కుటీర పరిశ్రమలు స్థాపిస్తాను. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కృషి చేస్తాను.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

- వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



కోనరావుపేట: మల్కపేటలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

కోనరావుపేట: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. కోనరావుపేట మండలం మల్కపేటలో రజక సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ చంద్రయ్య, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య, వైస్ ఎంపీపీ వంగపెల్లి సుమలత, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మల్యాల దేవయ్య, మహిళా నాయకురాలు నేరెళ్ల జ్యోతి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'చల్మెడ' తనయ ప్రచారం

కథలాపూర్: కథలాపూర్ మండలం భూషణరావుపేటలో వేములవాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా ఆయన కూతురు నివేదిత గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. మహిళలకు బొట్టు పెట్టి ఓటు అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ నాయకులు ర్యాలీగా ఇంటింటా వెళ్లి మెనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ ఎంపీపీ లోక భువనేశ్వరి, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, సర్పంచ్ గడీల గంగప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ కొత్తపెల్లి శ్రీనివాస్, తీట్ల శంకర్, బద్దం మహేందర్, గడ్డం దేవారెడ్డి, నర్సారెడ్డి, ముస్కు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: ఆటో కార్మికులకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని, ఇటీవల ఆటోలకు టాక్స్ రద్దు చేస్తానని ప్రకటించారని, ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై తప్పకుండా స్పందిస్తామని ఎమ్మెల్యే రమేశ్‌బాబు, బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. వేములవాడ పట్టణ ఆటో యూనియన్ సభ్యులతో గురువారం సంగీత నిలయంలో ఆటో యూనియన్ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు యాచమనేని శ్రీనివాసరావు, అధ్యక్షులు బత్తుల దేవరాజ్, పార్టీ పట్టణ ఇన్‌చార్జి రాజేందర్, నాయకులు జడల శ్రీనివాస్, బాబుస్‌లతో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

మేడిపల్లి: మండలంలోని బీమారం, కమ్మరిపేట, వెంకట్రావుపేట, రాగోజీపేట, గోవిందారం, రాజలింగంపేట, కట్లకుంట, పోరుమల్ల గ్రామాల్లో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. చల్మెడ లక్ష్మీనరసింహారావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రం అధోగతి



మంత్రి కొప్పులకు తిలకం దిద్దుతున్న మహిళలు

పెగడపల్లి: కాంగ్రెస్ నాయకులు చెప్పే మాటలు నమ్మి వారికి అధికారం అప్పగిస్తే తెలంగాణ రాష్ట్ర అధోగతి పాలవుతుందని మంత్రి ఈశ్వర్ అన్నారు. పెగడపల్లి మండలంలోని రాములపల్లి, వెంగళాయిపేట, లింగాపూర్, శాలపల్లి గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోతుందని చెబుతున్న కాంగ్రెస్ కావాలా, 24 గంటలు కరెంట్ ఇస్తున్న బీఆర్‌ఎస్ కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాజేశంగౌడ్, ఎంపీపీ శోభ, సర్పంచులు గంగాభవాని, సులోచన, తార, విండో చైర్మన్లు రమణారావు, వేణుగోపాల్, వైస్ ఎంపీపీ గంగాధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ అంజి, నాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో తెలంగాణ దూసుకుపోతోంది

ధర్మపురి: బీఆర్‌ఎస్ పాలనలో ఐటీ ఉద్యోగాలు భారీ సంఖ్యలో పెరిగాయని దీంతో హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని ఎన్నారై బీఆర్‌ఎస్ వ్యవస్థాపకుడు కూర్మాచలం అనిల్ అన్నారు. ధర్మపురి పట్టణంలో గురువారం మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఎన్నారై నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పథకాల్లో తెలంగాణ

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్, ముఖ్య సలహాదారు రావుల అంజయ్య అన్నారు. మాలల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన బీఆర్‌ఎస్ పార్టీకే మాలల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

కేజీబీవీలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

రాయికల్: మండలంలోని ఉపుమడుగు కేజీబీవీ బాలికల విద్యాలయంలో గురువారం శాసనసభ మాక్ పోలింగ్ నిర్వహించారు. పది మంది విద్యార్థులు ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో నిలిచారు. పదో విద్యార్థిని విదూష సమీప ప్రత్యర్థి హర్షితపై 14 ఓట్ల తేడా తో విజయం సాధించినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ నందిని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ ఘనత కాంగ్రెస్ పార్టీదే



లక్ష్మణ్ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

వెల్గటూర్: రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం ఎండపల్లి మండలం కొండాపూర్, ఎండపల్లి, అంబరిపేట, పాతగూడూర్ గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. 24 గంటల విద్యుత్ పేరుతో బీఆర్‌ఎస్ ప్రజలను మోసం చేస్తోందని, అసలు రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని సీఎం వైఎస్‌ఆర్ ప్రవేశపెట్టారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు తప్ప ఎవరికీ మేలు జరగలేదన్నారు. కార్యక్రమంలో వెలగటూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఎండపల్లి ఎంపీటీసీ బషీర్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, సర్పంచులు,ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మెట్‌పల్లి: కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి గంగోని క్రాంతి గురువారం కోరారు. హమాలీల కొరతతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు

మేడిపల్లి: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని అతడి నుంచి 33 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్ రాజ్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలైనప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 300 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు వాటి విలువ దాదాపు రూ.1,50,000 ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా గంగరాజం

జగిత్యాలరూరల్: పొరండ్ల గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గంను గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగరాజం, ఉపాధ్యక్షుడిగా రాజగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

సేవ చేయాలనే రాజకీయాల్లోకి వచ్చా

- వేములవాడ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థి వికాస్‌రావు

మేడిపల్లి: డబ్బు మీద వ్యామోహంతో రాజకీయలకు రాలేదని సేవచేయాలనే లక్ష్యంతో వచ్చానని వేములవాడ బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్ రావు అన్నారు. గురువారం మేడిపల్లి మండలంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. మేడిపల్లి, భీమారం మండలాల్లోని కొండపూర్, విలయతాబాద్, కాచారం, రాగోజీపేట, ఒడ్డెడు, వెంకట్రావుపేట, కమ్మరిపేట, భీమారం, రంగాపూర్, గుండ్లపల్లి, పోరుమల్ల, తొంబర్రావుపేట, కట్టకుంట గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. 30న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో తోగరి లక్ష్మీపతి, క్యాతం దశరథరెడ్డి, మహేందర్‌రెడ్డి, అన్నాడని జలపల్లిరెడ్డి, ఇజ్రయల్, దాసరి రఘు, కోటగిరి లింగాగౌడ్, గంగారాం, లింగారెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



సాగర్‌జీ సమక్షంలో బీజేపీలో చేరిన రవీందర్‌గౌడ్

కోనరావుపేట: మండలం నాగారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ వైస్ఎంపీపీ తీగల రవీందర్‌గౌడ్ మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, అభ్యర్థి వికాస్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనతో పాటు కొండాపూర్ అనుబంధ గ్రామమైన హనుమాన్‌తండాకు చెందిన 100 మంది గిరిజనులు బీజేపీలో చేరారు. వీరందరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. గోపాడి సురేందర్‌రావు, మిర్యాల్‌కార్ బాలాజీ, గొట్టె రామచంద్రం, జవ్వాజి తిరుపతిగౌడ్, పల్లిమక్త సర్పంచ్ జిన్న అనిల్, చల్ల జితేందర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

మెట్‌పల్లి: ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల పెంపునకు జాతీయ సేవా పథకం వలంటీర్లు కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బూర్ల చంద్రశేఖర్ సూచించారు. కళాశాలలో గురువారం వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాల పెంపు వల్ల విద్యార్థులు చదువుల్లో రాణించడానికి అవకాశముంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వలంటీర్లు విద్యార్థులకు తగిన విధంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు.కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకయ్య, ఉపన్యాసకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

మల్యాల: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఇంటింటా అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. అధికారంలోని రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కోరారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వెంకటాపూర్‌లో స్వామివారి శోభాయాత్ర

కోరుట్ల రూరల్: మండలంలోని వెంకటాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామంలో స్వామి వారి శోభాయాత్ర, శ్రీ విశ్వక్సేనారాధన, రక్షాబంధం, దీక్షాస్వీకారం, వాసుదేవ పుణ్యాహవచనం, మత్స్యగ్రహనం, అంకురారోపణం, అఖండ దీపారాధన, ఆచార్య రుత్విక్‌వర్ణనం, కుల దేవత స్థాపన, నివేదన, మంగళ శాసనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్ తోట శారద, ఆలయ కమిటీ అధ్యక్షుడు కటుకం రాజేశ్, సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో కార్తీక పూజలు



పెగడపల్లి శివాలయంలో దీపారాధనలో పాల్గొన్న భక్తులు

పెగడపల్లి: మండల కేంద్రంలోని శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. పూజల్లో భాగంగా గురువారం కార్తీక మాసం ఏకాదశి పురస్కరించుకుని స్వామి వారికి దీపారాధన వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారులు గుండి అరుణ, గుండి వినయ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మహిళలు పాల్గొని దీపాలు వెలిగించి పూజలు చేశారు.

రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



సోమన్‌పల్లిలో ప్రచారం చేస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్, సంగంపల్లి, సోమన్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేసీఆర్‌ను నమ్మే రోజులు పోయాయని,కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో నాయకులు పిట్టల శేఖర్, రమణారెడ్డి, ఆనందరెడ్డి, అన్నవేని రాజు, గోపు శ్రీధర్, రంజిత్, గంగరాజం, అనిల్, మహిపాల్‌రెడ్డి, ఇమామ్, రాజం, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.